క్లుప్తంగా

కొత్తూరులో తెలంగాణ న్యాయమూర్తి



న్యాయమూర్తి కుటుంబానికి తీర్థప్రసాదాలు అందిస్తున్న అర్చకులు, సిబ్బంది

పాణ్యం : మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో తెలంగాణ రాష్ట్ర మహబూబ్‌నగర్ జూనియర్ సివిల్ జడ్జి హరి కుమార్, గద్వాల జూనియర్ సివిల్ జడ్జి చైతన్య దంపతులు ఆదివారం స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అభిషేకాలు, అర్చనలు, సమస్త పూజలు, రుద్రాభిషేకంతో పాటు పలు పూజలు చేశారు. ప్రత్యేక పూజల అనంతరం వారికి ఈఓ రామకృష్ణ స్వామివారి శేష వస్త్రాలతో సన్మానించి తీర్థప్రసాదాలను అందించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సుబ్బారెడ్డి, అర్చకులు నారాయణస్వామి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి



బత్తుల సుబ్బారెడ్డి

పాణ్యం : మండల పరిధిలోని తమ్మరాజుపల్లె గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు బత్తుల సుబ్బారెడ్డి (74)అనారోగ్యంతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు ఆదివారం తెలిపారు. కొంత కాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతూ కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందినట్లు చెప్పారు. మృతుడు గతంలో నంద్యాల మార్కెట్‌యార్డు డైరెక్టర్‌గా పని చేశారన్నారు. మృతుడికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు సంతానం ఉన్నారు. మృతుని కోడలు విజయగౌరి ప్రస్తుతం గ్రామ సర్పంచ్‌గా ఎన్నికైయ్యారు.

వినాయక మండపాల ఏర్పాటు



పాణ్యంలో సిద్ధం చేసిన వినాకయ మండపం

పాణ్యం: వినాయక చవితిని పురస్కరించుకొని ఆయా గ్రామాల్లో నిర్వాహకులు ఉత్సాహంగా మండపాలను సిద్ధం చేస్తున్నారు. వినాకయ చవితి సందర్భంగా సోమవారం విగ్రహాలను ప్రతిష్ఠించేందుకు ముమ్మరంగా ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే నిర్వహకులు పోలీసుల నుంచి అనుమతులు తీసుకున్నారు. ఇప్పటి వరకు మండలంలో 20 మండపాలకు సంబధించి దరఖాస్తులు వచ్చినట్లు పోలీసులు తెలిపారు.

శరవేగంగా డ్రైనేజీ పనులు



కొనసాగుతున్న డ్రైనేజీ నిర్మాణ పనులు

కల్లూరు: మండల పరిధిలోని చిన్నటేకూరు గ్రామంలో డ్రైనేజీ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గ్రామంలో పర్యటిస్తుండగా ప్రజలు డ్రైనేజీ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఆయన చొరవతో మంజూరైన రూ. 20లక్షల గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో సుమారు 150 మీటర్ల సీసీ కాలువ నిర్మాణ పనులు చేపట్టారు.

మండపాల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరి



ముడుమాలలో ప్రజలతో మాట్లాడుతున్న ఎస్‌ఐ పీరయ్య

సి.బెళగల్: బహిరంగ ప్రదేశాలలో వినాయక మండపాల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరి అని, మీ సేవలలో ఈ చెలానాలు చెల్లించి దరఖాస్తులు చేసుకోవాలని ఎస్‌ఐ పీరయ్య సూచించారు. ఆదివారం ఆయన మండలంలోని వివిధ గ్రామాలలో పర్యటించి ప్రజలతో మాట్లాడారు. నిబంధనల మేరకు విగ్రహాలను ప్రతిష్ఠించుకోవాలని, ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా మండపాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

24న ఏపీ రైతు సంఘం జిల్లా కౌన్సిల్ సమావేశం

కర్నూలు(సెంట్రల్) : ఏపీ రైతు సంఘం జిల్లా కౌన్సిల్ విస్తృత స్థాయి సమావేశాన్ని ఈనెల 24వ తేదీన నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లాకార్యదర్శి కె.జగన్నాథం ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.ఎమ్మిగనూరులో జరిగే ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి పి.రామచంద్రయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య హాజరవుతారని వెల్లడించారు.

ప్రజా సంక్షేమం, అభివృద్ధి ప్రభుత్వ ధ్యేయం



వర్కూరులో నూతన గ్రామ సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

- అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాల వర్తింపు
- కోడుమూరు నియోజకర్గ అభివృద్ధికి రూ.300కోట్ల ఖర్చు
- ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

కోడుమూరు రూరల్: ప్రజా సంక్షేమం, అభివృద్ధి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ పేర్కొన్నారు. అర్హతే ప్రామాణికంగా పార్టీలు, కులమతాలు, వర్గాలు, ప్రాంతాలకు అతీతంగా పేదలందరికీ సంక్షేమ పథకాలు వర్తింపజేస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. మండలంలోని వర్కూరు ఎస్సీ కాలనీలో రూ.40లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయాన్ని ఆదివారం ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న పాలనలో ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందాయన్నారు. అదే విధంగా కోడుమూరు నియోజకవర్గం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ.300కోట్లకు పైగా ఖర్చు చేసిందన్నారు. గోరంట్ల–కొత్తపల్లె బ్రిడ్జి, వర్కూరు తుమ్మలవాగుపై బ్రిడ్జి, కోడుమూరు నుంచి ముడుమలగుర్తికి వెళ్లే రోడ్డు నిర్మాణం, గూడూరు నుంచి పులకుర్తి, ఆర్.ఖానాపురం, కె.నాగులాపురం నుంచి బూడిదపాడుకు రోడ్డు నిర్మాణాలతో పాటు, గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణాలు వంటి ఎన్నో అభివృద్ధి పనులను తమ హయంలో చేపట్టడం సంతోషంగా ఉందన్నారు. సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థల సేవలను ప్రతిఒక్కరూ కొనియాడుతున్నారని, ప్రజల వద్దకే పాలన సాగుతుందన్నారు. గతంలో టీడీపీ నాయకులు గ్రామసచివాలయాలు, వలంటరీ వ్యవస్థపై లేనిపోని విమర్శలు చేశారని, వారికి ప్రజలే తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ప్రజల వద్దకే పాలన కొనసాగించేందుకు మరోమారు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోరారు.

బాబు మభ్యపెట్టే మాటలను ప్రజలు నమ్మే స్థితి లేదు

టీడీపీ అధినేత చంద్రబాబు మభ్యపెట్టే మాటలను ప్రజలు నమ్మే స్థితిలో లేరని ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ తెలిపారు. స్కిల్ కుంభకోణం అంశంలో అధికారులు అన్నివిధాలుగా ఆలోచించి నిర్ణయం తీసుకున్నారని, రూ.371కోట్ల ప్రజల సొమ్మును అక్రమంగా కాజేసినందుకే చంద్రబాబు జైలుకెళ్లారన్నారు. ఇప్పటికీ కూడా చంద్రబాబు తప్పు చేయలేదని ఆ పార్టీ నాయకులు చెప్పడం లేదని, కేవలం అక్రమంగా అరెస్ట్ చేశారంటూ రాద్ధాంతం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చంద్రశేఖర్, ఏఈ గంగరాజు, వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ్‌యాదవ్, స్థానిక నేతలు అద్దుగల రాజశేఖర రెడ్డి, మదన్‌మోహన్‌రెడ్డి, లాయర్ ప్రభాకర్, అయ్యప్ప, పాపిరెడ్డి, రమణారెడ్డి, దానియేలు, బలరాం గ్రామ సచివాలయ సిబ్బంది, హెల్త్ సిబ్బంది, వలంటరీలు పాల్గొన్నారు.

రంగురంగుల బంతి పూలు

మండల పరిధిలోని బస్తిపాడు గ్రామ సమీపంలోని పొలాల్లో బంతి పూలు విరగ్గాశాయి. రంగు రంగుల్లో ఎంతో మనోహరంగా ఉన్న బంతి (చెండుపూలు) పూలు అటు వైపుగా వెళ్తున్న వ్యవసాయ కూలీలు, రైతులు, ప్రజలు చూపులను ఆకటుకుంటున్నాయి.

–కల్లూరు



విరగ పూసిన బంతి పూలు

యాదవ సంక్షేమ వేదిక అధ్యక్షుడిగా విక్రమ్‌కుమార్

కర్నూలు(అర్బన్): నంద్యాల జిల్లా పాణ్యం నియోజకవర్గం యాదవ సంక్షే మ వేదిక అధ్యక్షుడిగా జి. విక్రమ్‌కుమార్‌ను ఎంపిక చేసినట్లు ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు వరుణ్‌కుమార్ యాదవ్ పేర్కొ న్నారు. ఆదివారం స్థానిక ఆ సంఘం కార్యాలయంలో కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాదవుల సమస్యలు పరిష్కరించి రాజకీయంగా, ఆర్థికంగా ఎదిగేందుకు తగిన సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు మధు యాదవ్, శేషు యాద వ్, మహేంద్ర యాదవ్, రమేష్ యాదవ్, రమేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నాలుగు వాహనాల పట్టివేత

కర్నూలు (న్యూసిటీ) : అక్రమంగా మట్టి తరలిస్తున్న నాలుగు వాహనాలను పట్టుకున్నట్లు జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ శనివారం రాత్రి బెంగుళూరు హైవేలో తనిఖీ చేసి అనుమతులు లేకుండా గ్రావెల్ తీసుకెళ్తున్న నాలుగు వాహనాలను సీజ్ చేశామని చెప్పారు.

పేదల ఆర్థికాభివృద్ధే లక్ష్యం



వృద్ధురాలికి సంక్షేమ క్యాలెండర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి
- హుసేనాపురంలో ముగిసిన 'గడప గడపకు మన ప్రభుత్వం'

ఓర్వకల్లు : పేదల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని హుసేనాపురం గ్రామంలో గత నాలుగు రోజులుగా నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఆదివారం ముగిసింది. గ్రామ సర్పంచు చంద్ర గోవర్ధనమ్మ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యేతో పాటు కర్నూలు మార్కెట్ యార్డు చైర్మన్ శ్రీరెడ్డి,ప్రభాకర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు రంగనాథ్‌గౌడు, ఎంపీపీ తిప్పన్న, సింగిల్ విండో చైర్మన్ నాగతిరుపాలు, జేసీఎస్ మండల కన్వీనర్ లోటర్‌బాషా హాజరయ్యారు. కార్యక్రమంలో ముందుగా ఎస్సీ కాలనీ, కింది బస్టాండ్, జంగాల పేటలో అధికారులతో కలిసి ఎమ్మెల్యే విస్తృతంగా పర్యటించారు. నాలుగేళ్లలో ప్రభుత్వం అందజేసిన సంక్షేమ పథకాలను వివరిస్త.. ప్రజా సమస్యలు తెలుసుకుంటూ, అవినీతిరహిత పాలనను గూర్చి ప్రజలకు వివరించారు. అలాగే లబ్ధిదారులకు సంక్షేమ క్యాలెండర్లు పంపిణీ చేశారు.

నాలుగేళ్లలో 95 శాతం హామీల అమలు..

రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగేళ్లలో ప్రజలకు ఇచ్చిన హామీలలో సుమారు 95 శాతం దశల వారీగా అమలు చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. జగనన్న హౌసింగ్ కాలనీలు, సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, పొలం రస్తాలు, విద్యుత్ సరఫరా వంటి అభివృద్ధి కార్యక్రమాలతో పాటు అమ్మ ఒడి, జగనన్న విద్యా కానుక, విద్యాదీవెన, వసతి దీవెన, వైఎస్సార్ చేయూత, ఆసరా, సున్నావడ్డీ, పెళ్లి కానుక, రైతు భరోసా వంటి సంక్షేమ పథకాలను ప్రజలకు పారదర్శకంగా అందజేసిన ఘనత జగన్ మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శివనాగప్రసాద్, స్థానిక నాయకులు చంద్ర పెద్దస్వామి, జీకే వెంగన్న, గోపా వెంకటరమణారెడ్డి, గోపా మోహన్‌రెడ్డి, కాల్వబుగ్గ ట్రస్టుబోర్డు చైర్మన్ గుర్రాల చెన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి వినాయక చవితి ఉత్సవాలు



కోడుమూరులో మండపాలకు తరలించేందుకు సిద్ధంగా ఉంచిన వినాయక విగ్రహాలు

కోడుమూరు రూరల్ : వినాయక చవితి ఉత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. కోడుమూరు పట్టణంలోని వీధి వీధిలో వినాయక విగ్రహాలను కూర్చొబెట్టేందుకు నిర్వాహకులు ప్రత్యేకంగా మండపాలను ముస్తాబు చేశారు. వినాయక చవితి పర్వదినం సందర్భంగా ఆదివారం పట్టణంలో వినాయక విగ్రహాల అమ్మకాలు జోరుగా కొనసాగాయి. విగ్రహం సైజును మేరకు రూ.500 నుంచి రూ.15వేల వరకు కొనుగోళ్లు సాగుతున్నాయి. వినాయక విగ్రహాల రేట్లు గతేడాది కంటే భారీగా పెరడడంతో చాలామంది చిన్న సైజు విగ్రహాలను కొనుగోలు చేస్తున్నారు.

ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి

వినాయక చవితి ఉత్సవాలను మండల ప్రజలంతా ప్రశాంతంగా జరుపుకోవాలని కోడుమూరు ఎస్‌ఐ శ్రీనివాసులు సూచించారు. వినాయక మండపాలను ట్రాఫిక్‌కు ఇబ్బంది కలగకుండా ఏర్పాటు చేసుకోవాలన్నారు. మండపాల వద్ద పెద్ద పెద్ద శబ్ధాలు చేసే మైక్ సెట్లు, డీజేలను ఏర్పాటు చేయరాదన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహారిస్తే చర్యలు తప్పవని ఎస్‌ఐ హెచ్చరించారు.

నగర పరిశుభ్రత మనందరి బాధ్యత

- మేయర్ బీవై రామయ్య
- నగరంలో స్వచ్ఛత హీ సేవా ర్యాలీ



స్వచ్ఛతా హీ ర్యాలీలో మాట్లాడుతున్న మేయర్ బీవై.రామయ్య

కర్నూలు (టౌన్): నగర పరిశుభ్రత మనందరి బాధ్యత అని నగర మేయర్ బీవై రామయ్య అన్నారు. ఆదివారం మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకుని చెత్త రహిత దేశంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా నగరంలో ర్యాలీ నిర్వహించారు. నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో కొండారెడ్డి బురుజు వద్ద గాంధీ విగ్రహానికి నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజతో కలిసి మేయర్ పూలమాలలు వేశారు. అలాగే వినాయక్ ఘాట్ ప్రాంతాల్లో ర్యాలీలు నిర్వహించారు. పరిసరాల ప్రాంతాల్లో శుభ్రత కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భగా మేయర్ మాట్లాడుతూ వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత స్వచ్ఛత కార్యక్రమాలు, ప్లాస్టిక్ నిర్మూలన, స్వచ్ఛ సర్వేక్షణ్, తడిచెత్త, పొడిచెత్త వేరు చేయడంపై పెద్ద ఎత్తున్న ప్రజలకు అవగాహన కార్యక్రమాలు, విద్యార్థినీ, విద్యార్థులకు క్విజ్‌పోటీలు నిర్వహిస్తుందన్నారు. ఐదేళ్ల క్రితంతో పోల్చితే కర్నూలు నగరంలో స్వచ్ఛత మెరుగుపడిందన్నారు. చెత్త దిబ్బలు లేకుండా ఇంటింటికి వెళ్లి చెత్త సేకరణ చేయడంతో మంచి ఫలితాలు వచ్చాయన్నారు. పరిశుభ్రత నగరాల్లో కర్నూలు నగరాన్ని రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలబెట్టడమే తమ లక్ష్యమన్నారు. కమిషనర్ భార్గవ్‌తేజ మాట్లాడుతూ మన నగరాన్ని మనం శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలన్నారు. అందరం కలిసికట్టుగా చెత్తపై సమరం చేస్తేనే స్వచ్ఛ నగరం సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో కర్నూలు అంబాసిడర్ ఇండియన్ సాఫ్ట్‌బాల్ క్రీడాకారిణి కళ్యాణి, నగరపాలక ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, శానిటేషన్ సూపర్‌వైజర్ నాగరాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు రాజు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా అక్రమ విద్యుత్ కనెక్షన్లు



తాండ్రపాడు హెచ్ఎన్ఎస్ కాల్వ పక్కనే పొలాల్లో ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలించిన అక్రమ విద్యుత్ కనెక్షన్లు

అక్రమ విద్యుత్ కనెక్షన్లు తొలగిస్తాం

అక్రమ కనెక్షన్లపై విచారణ జరిపి తొలగిస్తాం. విద్యుత్ శాఖలో విజిలెన్స్ అధికారులు సిద్ధంగా ఉన్నారు. వెంటనే వారికి తెలియజేసి తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. లైన్‌మెన్‌పై వచ్చిన ఆరోపణలపై కూడా విచారణ జరుపుతాం. బాధ్యులందరిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటాం.

– ఆంజనేయ శాస్త్రి, ఏఈ కర్నూలు రూరల్

కర్నూలు (న్యూటౌన్): కర్నూలు మండలంలోని బీ తాండ్రపాడు పరిధిలోని హంద్రీనీవా సుజల స్రవంతి కాల్వ పక్కనే కొందరు రైతులు ట్రాన్స్‌ఫార్మర్‌కు అక్రమంగా విద్యుత్ కనెక్షన్లు తగిలించుకుని మరీ యథేచ్ఛగా విద్యుత్‌ను వినియోగిస్తున్నారు. విద్యుత్ చౌర్యంతో పాటు అక్రమాలకు పాల్పడుతున్నా.. అధికారులే కంచె చేను మేసినట్లు మామూళ్ల వసూలు చేస్తూ.. వారిని ప్రోత్సహిస్తుండటంతో అక్రమానికి సక్రమ మార్గం ఏర్పడింది. గ్రామాల్లో లైన్‌మెన్‌ల అక్రమ వసూళ్లకు అడ్డూ అదుపు లేకపోయింది. విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు స్పందించి అక్రమంగా వినియోగిస్తున్న వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు తొలగించి బాధ్యులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని బీ తాండ్రపాడు గ్రామ ప్రజలు కోరుతున్నారు.

నేడు నూతన భవనాల ప్రారంభోత్సవం



పోలకల్‌లో ప్రారంభోత్సవానికి సిద్ధమైన గ్రామ సచివాలయం - 2



పోలకల్‌లో ప్రారంభోత్సవానికి సిద్ధమైన పోలకల్ ఆర్బీకే - 3

సి.బెళగల్: మండల పరిధిలోని పోలకల్ గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆర్బీకేతోపాటు సచివాయ భవనాలను సోమవారం ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేయించనున్నట్లు పంచాయతీరాజ్ ఏఈ గంగరాజు తెలిపారు. రూ.40 లక్షలతో నిర్మించిన పోలకల్ గ్రామ సచివాలయ – 2 భవనం, రూ.21.80 లక్షలతో నిర్మించిన రైతుభరోసా కేంద్రాన్ని ఉదయం 9గంటలకు ఎమ్మెల్యే ప్రారంభిస్తారన్నారు. ఈ మేరకు ఆదివారం నూతన భవనాల ప్రారంభోత్సవ ఏర్పాట్లను ఎంపీపీ బొంతల మునెప్ప కార్యక్రమానికి మండల నాయకులు, ప్రజా ప్రతినిధులు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

మండపాలు సిద్ధం

గూడూరు: వినాయక చవితి సందర్భంగా గణేషుడి కొలువు కోసం మండ పాలను నిర్వాహకులు సిద్ధం చేశారు. పట్టణంలో దాదాపు 50 ప్రాంతాలలో వినాయకుడిని ప్రతిష్ఠించేందుకు ఏర్పాట్లు చేశారు. మండపాల దగ్గర రంగు రంగుల విద్యుత్ లైట్లు, ప్రత్యేక అలంకరణ పనుల్లో నిర్వాహకులు నిమగ్నమయ్యారు.

'సుంకేసుల'లో 1.194 టీఎంసీల నిల్వ

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్‌లో 1.194 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు ఆదివారం డ్యామ్ అధికారులు తెలిపారు. కేసీ కాల్వకు 331 క్యూసెక్కుల నీటిని విడుదల చేశామన్నారు. ఇన్‌ఫ్లో నిలిచిపోయిందని, దిగువకు నీటి విడుదల నిలిపేసినట్లు అధికారులు పేర్కొన్నారు.

'నా జీవన ప్రస్థానం -ఆత్మ కథ' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు, సాహితీ వేత్తలు

కర్నూలు కల్చరల్: సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత డాక్టర్ ఎస్.జి.ఎమ్. సుభాన్ రచించిన ' నా జీవన ప్రస్థానం – ఆత్మ కథ' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఆదివారం సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో ఆ క్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య పుస్తకావిష్కరించి మాట్లాడారు. సాహితీ స్రవంతి నగర అధ్యక్షుడు ఆవుల చక్రపాణి యాదవ్ పుస్తక సమీక్ష చేశారు. సమితి రాష్ట్ర అధ్యక్షుడు కెంగార మోహన్ ప్రధాన వక్తగా హాజరై ప్రసంగించారు. వ్యక్తిత్వ వికాసానికి అద్దం పట్టే నేటి తరానికి స్ఫూర్తినిచ్చే రచనగా నా జీవన ప్రస్థానం – ఆత్మకథ అన్నారు. సమాజాన్ని చైతన్యం చేసే రచనలు రావాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజానాట్య మండలి ఉపాధ్యక్షుడు బసవరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో హైకోర్టు రిజిస్ట్రార్ వై.క్రిష్ణవర్ధన్‌రెడ్డి, ప్రముఖ కంటి వైద్యులు డాక్టర్ జయ ప్రకాష్, అన్నమయ్య జిల్లా సోషల్ వెల్ఫేర్ డీడీ జాకీర్ హుసేన్, కర్నూలు మెడికల్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రభాకర్ రావు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవిశ్వకర్మ జయంత్యుత్సవం



కోడుమూరులో శ్రీవిశ్వకర్మ చిత్రపటం ఊరేగింపు నిర్వహిస్తున్న విశ్వబ్రాహ్మణులు

కోడుమూరు రూరల్: శ్రీమద్విరాట్ విశ్వకర్మ జయంతి మహోత్సవ కార్యక్రమాన్ని కోడుమూరులో విశ్వబ్రాహ్మణులు ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. జయంత్యోత్సవాల్లో భాగంగా ఉదయం శ్రీకాళికాదేవి ఆలయంలో గణపతిపూజ, పుణ్యాహవాచనం, శ్రీవిశ్వకర్మ పతాకావిష్కరణ, శ్రీవిశ్వకర్మ పూజ, పంచశక్తి సమేత పంచ బ్రహ్మల పూజ, శ్రీగాయత్రి సమేత శ్రీవిశ్వకర్మ హోమం, మంగళహారతి, ఊరేగింపు కార్యక్రమాలు అంగరంగ వైభవంగా జరిగాయి. శ్రీవిశ్వకర్మ చిత్ర పటం ఊరేగింపు సందర్భంగా కర్ణాటక కళాకారుడు వీరభద్రుడి వేషం ఆకట్టుకుంది. అనంతరం శ్రీకాళికాదేవి ఆలయంలో ఏర్పాటు చేసిన హోమాన్ని డీఆర్‌డీఓ శాస్త్రవేత్త వీరబ్రహ్మంతో కలిసి శ్రీలక్ష్మీ వేంకటేశ్వర ఆలయ చైర్మన్ దాత ఎద్దుల మహేశ్వరరెడ్డి ప్రారంభించారు. అమ్మవారికి, శ్రీమద్విరాట్ విశ్వకర్మకు ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో శ్రీకాళికాదేవి ఆలయ కమిటీ అధ్యక్షుడు వీరశేఖర ఆచారి, గౌరవాధ్యక్షులు చిన్న బుగ్గన్న ఆచారి, లక్ష్మయ్య ఆచారి, ఉపాధ్యక్షుడు వెంకటస్వామి, సభ్యులు తిమ్మయ్య, నాగరాజు, మహేష్, నరేష్, జయరాం, రమణ, రామక్రిష్ణ, నాగేంద్ర ఆచారి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి

కల్లూరు: కల్లూరులో వెలసిన శ్రీ కాళికాదేవి (శ్రీ కాళమ్మ)దేవాలయంలో ఆదివారం శ్రీ గాయత్రి విశ్వకర్మ పూజామహోత్సవమును విశ్వబ్రాహ్మణులు, గ్రామ పెద్దలు నిర్వహించారు. ఉదయం అభిషేకము, మంగళహారతి, తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలు జరిగాయి. కల్లూరు ఊరువాకిలి దగ్గర నుంచి నందికోల సేవ, ప్రభోత్సవము పుర వీధులగుండా ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులయ్యారు.



నందికోల సేవ, ప్రభోత్సవములో పాల్గొన్న భక్తులు

వర్గీకరణ బిల్లులను ఆమోదించాలి

కర్నూలు(సెంట్రల్): ప్రత్యేక పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లులను ఆమోదించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొందిమడుగుల టీఎం రమేష్ మాదిగ డిమాండ్ చేశారు. ఆదివారం కలెక్టరేట్ ఎదుట ఆ సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాదిగల చిరకాల కోరికను ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆమోదించాలన్నారు.

క్లాప్ ఆటో డ్రైవర్ల సమస్యలపై పోరాటం

కర్నూలు(సెంట్రల్) : ఏపీ క్లాప్ ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కరించే వరకు పోరాటం చేస్తామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ అంజబాబు, సీఐటీయూ ఓల్డ్ సిటీ ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు తెలిపారు. ఆదివారం ఆ యూనియన్ ఆధ్వర్యంలో పున్నమి గెస్టు హౌస్ నుంచి సీతారామనగర్, కొత్తబస్టాండ్ వరకు, అక్కడి నుంచి సుందరయ్య భవన్ వరకు వచ్చి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు అగ్రిమెంట్ ప్రకారం డ్రైవర్‌కు జీతం రూ.18,500 ఇవ్వాలన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ సదుపాయం కల్పించాలని, వీక్లీ ఆఫ్ వసతి కల్పించాలని, అక్రమంగా తొలగించిన వారిని విధుల్లోకి తిరిగి తీసుకోవాలని కోరారు.